సాక్షి జగిత్యాల

మంగళవారం, 25, ఏప్రిల్, 2023



గర్భిణులకు సీమంతం

రాయికల్: అంగన్‌వాడీ కేంద్రం- 8లో గర్భిణులకు సోమవారం సీమంతం చేశారు. పోషక విలువలపై అవగాహన కల్పించారు.



బోనమెత్తిన బతికపల్లి

పెగడపల్లి : బతికపల్లిలో మూడోరోజు బీరప్ప ఉత్సవాల సందర్భంగా గొల్ల, కురుమ మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

రాలిన కాయ కిలో రూ.5



నాలుగురోజులపాటు కురిసిన అకాలవర్షం.. బలమైన ఈదురు గాలులు.. రాళ్లలాంటి వడగళ్లతో తోటలోని మామిడికాయలన్నీ రాలిపోయినయి.. కిందపడ్డ కాయల్లో సగం పగిలిపోయినయి.. మిగిలినవి మంచిగనే ఉన్నా.. మంచివి, పగిలిన కాయలన్నింటికీ ఒకేతీర్గ కిలో రూ.5 ధర పెట్టిండ్రు.. గిట్లయితే ఇగ మాకు మిగిలేదేంది? నిండా మునిగినట్లే.

– కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన మామిడి రైతు మోహన్‌రెడ్డి ఆవేదన



కోరుట్ల శివారులోని ఓ తోటలో ఈదురుగాలుల ధాటికి రాలిపోయిన మామిడికాయలు

- రంగంలోకి దిగిన దళారులు
- అగ్గువసగ్గువకు కొనుగోళ్లు
- దయనీయ స్థితిలో మామిడి రైతులు
- వడగళ్లు, అకాలవర్షం తెచ్చిన నష్టం
- ఐదురోజులుగా వీడని అకాలం'

కోరుట్ల: జిల్లాలో నాలుగు రోజులపాటు ఈదురు గాలులతో కూడిన వడగళ్లవానలు కురిసి అన్నదాతలకు కడగళ్లు మిగిల్చాయి. ప్రధానంగా మేడిపల్లి, కోరుట్ల, కథలాపూర్, రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో వరుసగా వడగళ్లు, భారీ వర్షం కురవడంతో మామిడికాయలన్నీ రాలిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం, సోమవారం సాయంత్రం కూడా కోరుట్ల, కథలాపూర్, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలుల తోకూడిన వడగళ్లు కురిసి చెట్లకు మిగిలిన కాయలన్నింటినీ నేలపాలు చేశాయి.

కాత అంతంతే..

- జిల్లాలో సుమారు 42 వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడితోటలు ఉన్నాయి.
- కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్లలోనే మామిడి తోటలు అధికంగా ఉన్నాయి.
- ఈ ప్రాంతంలోనే ఐదురోజులుగా ఎక్కువగా ఈదురుగాలులు, వర్షం, వడగళ్లు కురుస్తుండటంతో తోటల్లో సగం కాయలు రాలిపోయాయి.
- ఈసారి కాత అంతంతే ఉంది. అయితే, మామిడి కిలో రూ.30కి మించి రావడంలేదు.
- దీంతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు.. కాయరాలిపోవడంతో పెట్టుబడి కూడా ఇచ్చేట్టులేదని కుంగిపోతున్నారు.

మామిడి కొనుగోళ్లు ప్రారంభం..

జగిత్యాల, కోరుట్ల మార్కెట్లలో 15రోజులుగా మామిడి కొనుగోళ్లు సాగుతున్నాయి. ఇక్కడి మామిడికాయల కొనుగోళ్లలో ఢిల్లీ వ్యాపారుల పాత్ర అత్యధికంగా ఉంది. అక్కడి వ్యాపారులతో సత్సంబంధాలు కొనసాగించే స్థానిక వ్యాపారులు.. బంగినపల్లి రకం మామిడికాయ సైజును బట్టి కిలో రూ.30 నుంచి రూ.35 వరకు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. స్థానిక వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ఈ క్రమంలో.. వరుసగా అకాలవర్షం, వడగళ్లు కురవడంతో కాయలు రాలిపోతున్నాయి. కిందపడ్డ కాయలు దెబ్బతినడంతో ఎక్కువకాలం నిల్వచేసే పరిస్థితి ఉండదు. ఇలాంటి కాయలను రైతులు మార్కెట్‌కు తరలిస్తే.. స్థానిక వ్యాపారులు కిలోకు రూ.5 మించి పైసా ఎక్కువ ధర చెల్లించడంలేదు. చేసేదిలేక రైతులు ఆ ధరకే కాయలు విక్రయిస్తున్నారు.

దళారులకు వరం..

- రాలిన మామిడికాయలు కొనుగోలు చేస్తున్న స్థానిక వ్యాపారులు.. నాణ్యంగా ఉన్నవాటిని వేరుచేసి ఢిల్లీ వ్యాపారులకు కిలో రూ.25 నుంచి రూ.30 ధరతో విక్రయిస్తున్నారు. ఎక్కువగా దెబ్బతిన్న కాయలను స్థానికవీధి వ్యాపారుల ద్వారా రూ.10 నుంచి రూ.15 వరకు ధరతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మొత్తమ్మీద దళారులు, ఢిల్లీ వ్యాపారులు పెద్దగా లాభపడుతుండగా కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి రైతులకు పెట్టుబడి కూడా రాక ఆర్థికంగా కుదేలవుతున్నారు. చివరకు అప్పులపాలవుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాలవర్షాలు, వడగండ్లవానతో పెద్దఎత్తున మామిడి కాయలు రాలిపోయినయి. రాలిన కాయకు ధర రావడం లేదు. రెండు రోజులు నిల్వ చేస్తే మురిగిపోతున్నయి. చేసేదిలేక అయినకాడికి అమ్ముకుంటున్నం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– బాపురావు, మామిడి రైతు, అయిలాపూర్

పరిహారం ఇవ్వాలి



ఏటా మమ్మల్ని వడగండ్ల వాన ఇడిసిపెడ్త లేదు. ఈసారి వాన కన్నా.. ఈదురుగాలులు బాగావచ్చినయి. నాలుగురోజులుగా రోజూ ఈదురుగాలులు వస్తున్నయి. కాయలు రాలడమే కాదు.. మామిడిచెట్లు కూలిపోయినయి. మాకు పరిహారం ఇయ్యాలె.

– చిట్యాల లక్ష్మణ్, మామిడిరైతు, మల్లాపూర్

గుత్తేదారులతో చిక్కులు..

చాలామంది స్థానిక గుత్తేదారులు.. మామిడికాత మొదలు కాగానే చెట్లు, గతం, ప్రస్తుత కాత తీరు, చెట్ల రకం ఆధారంగా ఎకరాకి రూ.50 వేల నుంచి రూ.60వేల వరకు గంపగుత్త కింద ఒప్పందం చేసుకుంటారు. సగం మామిడితోటలు ఇప్పటికే ఇలా ఒప్పందాలు జరిగాయి. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలులతో సగంకాయలు రాలడంతో గుత్తేదారులు మార్కెట్‌లో వాటికి ధర రాదని కుంటిసాకులు చెబుతూ ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వలేమంటున్నారు. దీంతో మామిడి రైతులు, గుత్తేదారులకు మధ్య చాలాచోట్ల పంచాయితీలు నెలకొంటున్నాయి.

వణికిస్తున్న వానలు

- ఐదోరోజూ ఈదురుగాలులు.. వడగళ్లు
- తడిసిన ధాన్యం.. రాలిన మామిడికాయలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు



కథలాపూర్ : వర్షపు నీరు తొలగిస్తున్న రైతులు

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో వరుసగా ఐదోరోజు సోమవారం కూడా ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీవర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దకాగా, చెట్లకు మిగిలిన మామిడికాయలన్నీ రాలిపోయాయి. పసుపు, నువ్వుల పంట తీవ్రంగా దెబ్బతింది. సజ్జ పంటకూ నష్టం తప్పలేదు. కథలాపూర్, మల్యాల, కొడిమ్యాల తదితర మండలాల్లో పంట నష్టం అధికంగా ఉంది. కథలాపూర్ వారసంతలోని కూరగాయలు వర్షపునీటిలో కొట్టుకుపోవడంతో వ్యాపారులు, రైతులకు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు.

మల్యాలలో..

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భారీవర్షం కురిసింది. అక్కడక్కడా వడగళ్లు కురవడంతో వరి పొలాలు నేలవాలాయి. ఈదురుగాలులకు మామిడికాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పల చుట్టూ వర్షపునీరు వడ్లు కొట్టుకుపోయాయి.

కొడిమ్యాలలో..

కొడిమ్యాల(చొప్పదండి): వివిధ గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు నేలవాలాయి. వడ్లన్నీ నేలరాలాయి, కల్లాల్లో సిద్ధం చేసిన వడ్లు తడిసిపోయాయి. మామిడికాయలు రాలిపోయాయి. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ భవనం గోడ కూలిపోయింది.



మల్యాల: చెరువులా మారిన వాకిలి

న్యూస్‌రీల్

కార్మికుల పిల్లలకు పుస్తకాలు



పుస్తకాలు అందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): స్థానిక అడ్డరోడ్డు వద్ద ఇటుక బట్టీల్లోని కార్మికుల పిల్లలకు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. తొలుత పాఠశాలను డీఈవో సందర్శించి 11మంది పిల్లలకు నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రాజేశం, మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్, సీఆర్‌పీ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

2కే రన్ విజయవంతం



2కే రన్‌లో నిర్వాహకులు, విద్యార్థులు

కోరుట్లటౌన్: యువత సేవ చేయాలనే లక్ష్యంతో లియో క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ రహదారిపై సోమవారం 2కే రన్ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద క్లబ్ అధ్యక్షుడు గుంటుక రవిరాజ్, ప్రతినిధి ఆమేర్ మాట్లాడుతూ యువకులు చదువు, ఉద్యోగం చేసుకుంటూ సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా అవగాహన కల్పించేందుకు 2కే రన్ చేపట్టామన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, లియో సభ్యులు పవన్‌రాజ్, మణిదీప్, రాకేశ్, కార్తీక్, శివకృష్ణ, క్రాంతి, లియో కో ఆర్డినేటర్ మల్లికార్జున్, అఫ్జల్, అష్వన్, రాజకుమారి, ప్రియాంక, అధ్యాపకులు పాల్గొన్నారు.


స్వచ్ఛ గ్రామాలు లక్ష్యం



మాట్లాడుతున్న ప్రతినిధులు

మల్లాపూర్(కోరుట్ల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ స్ఫూర్తితో పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్బీఎం టీం కో ఆర్డినేటర్ హరిణి కోరారు. మండల కేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా సోమవారం పారిశుద్ధ్యం, తడి, పొడిచెత్త నిర్వహణపై గ్రామస్తులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్లు వినియోగించాలని సూచించారు. మురుగుకాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, ఈజీఎస్ ఏపీవో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని వినతి



పోస్టుకార్డులతో పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సోమవారం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డు ద్వారా వినతిపత్రం పంపించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ, గ్రామపంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న తాము నోటిఫికేషన్ ప్రకారం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం తక్షణమే క్రమబద్ధీకరణ చేయాలని వారు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు

బుగ్గారం(ధర్మపురి): ప్రభుత్వ బడుల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యాప్రమాణాలు పెరుగుతున్నాయని, మన ఊరు.. మన బడి లక్ష్యం ఇదేనని రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి మండలం జైన, ఎడపల్లి, మగ్గిడి, రాజారాంలో సోమవారం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో మంత్రి పాల్గొన్నారు. ఎడపల్లి, రాజారాంలో ఎరువుల గోదాములు ప్రారంభించారు. జైనలో రైతువేదిక, ముదిరాజ్ సంఘ భవనం, కాలనీల్లో సీసీ రోడ్లను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. దొంతాపూర్‌లో చేపట్టిన కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకే మన ఊరు మన బడి చేపట్టామన్నారు. రాష్ట్రంలోని తొమ్మిది వేలకుపైగా పాఠశాలల్లో తొలిదశలో 12 రకాల సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్, నాయకులు సొల్ల నరేశ్, మొగిలి శేఖర్, సొల్ల భీమయ్య, మల్లేశం పాల్గొన్నారు.

న్యాయస్థానానికి చేరిన నివేదిక

- 17గంటల పాటు స్ట్రాంగ్‌రూమ్‌లో అధికారుల పరిశీలన
- ఎన్నికల కమిషన్‌కు 'అడ్లూరి' ఫిర్యాదు



వీఆర్‌కే కళాశాల వద్ద పోలీసుల బందోబస్తు(ఫైల్)

జగిత్యాల: ధర్మపురి అసెంబ్లీ ఎన్నికలు–2018 సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ వ్యవహారంపై నివేదిక ఎట్టకేలకు సోమవారం హైకోర్టుకు చేరింది. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో 269 బూత్‌లు ఉండగా 14 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. అయితే, రెండు ఈవీఎంలు మొరాయించడంతో కౌంటింగ్‌ను కాసేపు నిలిపివేశారు. ఆ తర్వాత కౌంటింగ్ పూర్తిచేసిన ఎన్నికల అధికారులు.. 441 ఓట్ల మెజారిటీతో టీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విజయం సాధించినట్లు ప్రకటించారు. అయితే, లెక్కింపులో అక్రమాలు జరిగాయని ఓటమిపాలైన కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అప్పటినుంచి కేసు నడుస్తోంది.

కోర్టు ఆదేశాలతో..

అప్పటి ఎన్నికల సామగ్రి, డాక్యుమెంట్లు, సీసీ ఫుటేజీలు తదితరాలను తమకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించడం, కలెక్టర్ నేతృత్వంలో సామగ్రి భద్రపర్చిన మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడం, వాటిని పగులగొట్టి పూర్తినివేదిక ఇవ్వాలని సూచించడంతో ఆదివారం అధికారులు రంగంలోకి దిగారు. స్ట్రాంగ్‌రూమ్ తాళాలు పగులగొట్టి కోర్టు అడిగిన 17ఏ, 17సీ డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీల జిరాక్స్, సీసీ ఫుటేజీలు, ఇతర సామగ్రిని సోమవారం హైకోర్టుకు తీసుకెళ్లారు. నివేదికను కోర్టు ఈనెల 26న పరిశీలిస్తుందని తెలిసింది.

17 గంటలు ఉత్కంఠ..

స్ట్రాంగ్‌రూమ్ తాళాలను ఆదివారం ఉదయం 11 గంటలకు పగులగొట్టిన అధికారులు.. రికార్డులను పరిశీలించి నమోదు చేశారు. డాక్యుమెంట్ సాఫ్ట్‌కాపీలను జిరాక్స్ తీశారు. మొత్తం నివేదిక తయారు చేసే ప్రక్రియ సోమవారం ఉదయం 4గంటల వరకూ కొనసాగింది. అయితే, లోనికి ఇతరులను ఎవరినీ అనుమతించకపోవడం, అధికారులు ఎలాంటి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడడంతో ఏం జరుగుతుందోనని సుమారు 17గంటలపాటు ఉత్కంఠ నెలకొంది.

సీసీ ఫుటేజీల కోసం వినతి..

స్ట్రాంగ్‌రూమ్ తాళాలు పగులగొట్టిన నుంచి హైకోర్టుకు సమర్పించే నివేదిక వరకూ జరిగిన మొత్తం ప్రక్రియ వీడియో రికార్డు ఫుటేజీలను తనకు ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ సోమవారం కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కూ ఆయన పోస్టు ద్వారా ఫిర్యాదు పత్రం పంపించారు. అయితే, కోర్టుపై తనకు నమ్మకం ఉందని, చివరకు న్యాయమే గెలుస్తుందని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

బీడీకార్మికుల ఇళ్లస్థలాలు ఏవి?

- సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించిన సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి



పసుపు పంటను పరిశీలిస్తున్న వెంకటరెడ్డి

కథలాపూర్(వేములవాడ): బీడీకార్మికులకు ఇళ్లస్థలాలు, నిరుద్యోగులకు జీవనభృతి ఇస్తామన్న హామీ ఏమైందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. సోమవారం మండలకేంద్రంలో సీపీఐ ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ.45కే లీటర్ పెట్రోల్ వచ్చేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా పన్నులు విధించడంతో అదికాస్త రూ.100 దాటిందని మండిపడ్డారు. వీటిప్రభావం నిత్యావసరాలపైనా పడడంతో సామాన్యులు తల్లడిల్లుతున్నారని అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారని, భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కూడా రద్దు చేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలన్నదే సీపీఐ లక్ష్యమన్నారు. ఓటుహక్కు ఎలా ఉందో.. సంపద కూడా అందరికీ అలా ఉండాలని అన్నారు. నాయకులు వెన్న సురేశ్, మర్రి వెంకటస్వామి, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, వెన్నం రాధ, ప్రతినిధులు చెన్నవేని దశరథం, సోమ్మల్ల భూమారెడ్డి, కర్నె భూమయ్య, ముత్యాల మురళి, కొత్తపెల్లి ఇస్తార్ పాల్గొన్నారు.

పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

మెట్‌పల్లి(కోరుట్ల): పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో సీపీఐ ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మగా మారిన బీజేపీ హయాంలో దేశం తిరోగమనం వైపు వెళ్తోందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదలకు అండగా ఉంటాం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): పేదలకు అండగా ఉంటామని చాడ వెంకటరెడ్డి కోరారు. మండల కేంద్రంలో జరిగిన ప్రజా చైతన్యయాత్రలో మాట్లాడారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలనే డిమాండ్‌తో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు కొమొరెడ్డి కరం మాట్లాడుతూ ఈదురుగాలులు, వడగళ్ల వానలతో కోరుట్ల నియోజకవర్గంలో వందలాది ఎకరాల్లో మామిడి, సజ్జ, వరి, నువ్వుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు ఆర్థికంగా తీవ్రనష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి.. తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు తక్షణమే పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిట సత్యంరెడ్డితోపాటు నాయకులు కొమొరెడ్డి విజయ్, కట్కం గంగారెడ్డి, అల్లూరి లింగారెడ్డి, కృష్ణమూరి, అంబటి హన్మాండ్లు, భీమయ్య, లక్ష్మణ్, మారుతి, నవీన్, తేలు లక్ష్మి, మంజుదేవి పాల్గొన్నారు.

అర్జీలపై స్పందించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాల: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మకరంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి జరిగింది. మకరంద్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం జిల్లాకేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారని, అధికారులు శాఖల వారీగా అర్జీలు స్వీకరించి సానుకూలంగా పరిశీలించాలని పేర్కొన్నారు. కాగా, వివిధ సమస్యలపై 50 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఏ ఒక్కటీ వదలొద్దు

- 13 అసెంబ్లీ స్థానాలపై గులాబీ పార్టీ గురి
- 2014లో జగిత్యాల, 2018లో మంథని దూరం
- ఈసారి పాతజిల్లా క్లీన్‌స్వీప్ చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయం
- అభివృద్ధి వివరిస్తూనే బీజేపీపై ఎదురుదాడికి ప్రణాళికలు
- సోషల్ మీడియా సమగ్ర వినియోగంపై దృష్టి



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవాలని కారు పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేడు బీఆర్‌ఎస్ పార్టీగా రూపాంతరం చెందడం వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో విడదీయలేని అనుబంధం ఉంది. పార్టీ తొలి ఆవిర్భావ సభ నుంచి తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష వరకు.. ఇలా ఏది ప్రారంభించినా.. కరీంనగర్ నుంచి మొదలుపెట్టడం సీఎం కేసీఆర్‌కు సెంటిమెంటు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన రైతుబంధు, దళితబంధు పథకాలను కూడా కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభించడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రం ఆవిర్భవించాక రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్‌లో జగిత్యాల(జీవన్‌రెడ్డి) మినహా మిగిలిన అసెంబ్లీ స్థానాలు కారు పార్టీ కైవసం చేసుకుంది. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లోనూ కారు పార్టీ మంథని(శ్రీధర్‌బాబు) మినహా 12 అసెంబ్లీ స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. క్లీన్‌స్వీప్ చేయాలన్న ప్రతీసారి కాంగ్రెస్ కారు పార్టీ ఆశలపై నీళ్లు చల్లుతూ వస్తోంది. దీంతో ఈసారి ఎలాగైనా మొత్తం స్థానాలు సాధించాలని వ్యూహరచన చేస్తోంది. ఇందుకు ఈనెల 25న జరిగే నియోజకవర్గాల ప్లీనరీలను వేదికగా చేసుకుని కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు సిద్ధమవుతోంది. అందుకే.. అన్ని స్థానాల్లోనూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చేసిన పనులను వివరించడం, బీజేపీ నిధులు, విధుల విషయంలో అడ్డుపడుతున్న తీరును ప్రజలకు తెలియజేయాలని పలు తీర్మానాలను, నిర్ణయాలను ఆమోదించేందుకు సిద్ధమవుతోంది.

కీలక తీర్మానాలివే..!

- వ్యవసాయం రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులు.
- **సామాజిక భద్రత:** సమాజంలో పలువురుకు అందజేస్తున్న పింఛన్లు.
- **మహిళా సాధికారత:** సంఘాలు–రుణాలు, పింఛన్లు, షాదీముబారక్ తదితరాలు.
- **బీసీ సంక్షేమం:** గొర్రెల పంపిణీ, మత్స్యకారులు, చేనేత, గీత కారులు ఇతర కులవృత్తుల సంక్షేమం, రుణాలు మొదలైనవి.
- **దళిత సంక్షేమం:** దళితబంధు, గురుకులాలు.
- **గిరిజన సంక్షేమం:** తండాలు పంచాయతీలుగా అప్‌గ్రేడ్, రిజర్వేషన్లు, మిషన్ భగీరథ తాగునీరు
- **విద్య– ఉద్యోగం:** గురుకులాలు, మోడల్ స్కూళ్లు, మన ఊరు–మనబడి, హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాల సృష్టి.
- పట్టణ ప్రగతి/పల్లె ప్రగతి.
- మైనార్టీ వెల్ఫేర్
- ధరల పెరుగుదల మోదీ వైఫల్యం.
- తెలంగాణపై వివక్ష
- విభజన హామీల అమలు
- సింగరేణి గనుల వేలం
- కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు వేధింపులు తదితరాలపై కీలకమైన నేతలతోపాటు సాధారణ కార్యకర్తలను సైతం సిద్ధం చేసేందుకు 13 నియోజకవర్గాల్లో జరిగే.. ప్లీనరీ సమావేశాలను వేదికగా ఎంచుకుంది.

సోషల్ మీడియా వినియోగం..!

- పార్టీ 13 స్థానాలను సాధించే క్రమంలో మొత్తం బాధ్యతలను జిల్లా మంత్రులు, జిల్లా పార్టీ ఇన్‌చార్జులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులకు అప్పగించింది. పక్కా వ్యూహం ప్రకారం.. బీజేపీ, కాంగ్రెస్‌ల తీరును ఎండగడుతూ.. బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను, పూర్తి చేసిన పనులకు శంకుస్థాపనలను ప్రజలకు చేరేవిధంగా వ్యవహరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం ప్రధాన మీడియాతోపాటు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాలను సమగ్రంగా వినియోగించుకోవాలని, ఇందుకు సోషల్ మీడియా వారియర్‌లను పల్లెలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా బలోపేతం చేయాలని ఆదేశించింది. పార్టీ చేపట్టిన కార్యక్రమాలతోపాటు, ప్రతిపక్షాల విమర్శలకు ఎదురుదాడి కూడా అంతే దూకుడుగా ఉండాలని, ఆరోపణలను ఎండగట్టేలా సోషల్ మీడియాను పూర్తిస్థాయిలో వాడుకోవాలని సూచించింది.

క్లుప్తంగా

ధాన్యం తూకం ప్రారంభం


ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు

సాక్షి ఎఫెక్ట్

పెగడపల్లి(ధర్మపురి): మండల కేంద్రంలోని పెగడపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సోమవారం ధాన్యం తూకం వేయడం ప్రాంభించారు. ధాన్యం తూకం ప్రారంభిచేదెన్నడు అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన సహకార సిబ్బంది, ధాన్యం తూకం వేయడం ప్రారంభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక


రమేశ్

కోరుట్లటౌన్: పట్టణానికి చెందిన సోరుపాక రమేశ్ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు భాషా ఈ మేరకు సోమవారం లేఖ విడుదల చేశారు. రమేశ్ మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై నిజాయితీ, నిబద్ధతతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తరుగుపై పోరాటం చేయండి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 6 నుంచి 8 కిలోల వరకు తరుగు తీస్తున్నారని, దీనిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల ముఖ్య నాయకులతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల జిల్లాలో 40 వేల ఎకరాలకు పైగా మామిడి, నువ్వులు, జామ, వరిపంటలు దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకునేలా పోరాడాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, కన్వీనర్లు పాల్గొన్నారు.

రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌కు ఎస్పీ అభినందన


అభినందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్, షూటింగ్ విభాగంలో వెండి, కాంస్య పతకాలు సాధించిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులును ఎస్పీ ఎగ్గడి భాస్కర్ సోమవారం అభినందించారు. తమిళనాడులోని ఒటివక్కంలో గత జనవరి 9 నుంచి 13 వరకు జరిగిన పోలీసు డ్యూటీమీట్‌లో కాంస్య పతకం, గతేడాది అక్టోబర్‌లో కేరళ రాజధాని తిరువనంతపురంలో జరిగిన 31వ అఖిల భారత జీవీ మవలంకర్ షూటింగ్ పోటీల్లో వెండి పతకం సాధించారని తెలిపారు.

పేకాట జోరు.. బతుకు తారుమారు

- జిల్లాలో వీధిన పడుతున్న కుటుంబాలు
- ఈ ఏడాది ఇప్పటివరకు 20 కేసుల్లో 133 మంది అరెస్టు
- రూ.3.16 లక్షలు స్వాధీనం



జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. పోలీసులు కఠినచర్యలు చేపడుతున్నా జూదరుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. గతంలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి సుమారు రూ.3 కోట్ల ఆస్తులను అమ్మి, పేకాటకు పెట్టి నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. మరో మద్యం వ్యాపారి సుమారు రూ.కోటి మేరకు ఆన్‌లైన్‌లో పేకాట ఆడి, అప్పులపాలయ్యాడు. కుటుంబసభ్యులు లబోదిబోమంటూ తమ ఆస్తులమ్మి తీర్చారు. జూదంతో జిల్లాలో ఎందరివో కాపురాలు కూలిపోయాయి.

మూడేళ్లలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2021లో పోలీసులు 207 కేసులు నమోదు చేసి, 295 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.32.65 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. 2022లో 109 కేసులు నమోదు చేసి, 536 మందిని అరెస్టు చేశారు. రూ.16.91 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 20 కేసుల్లో 133 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3.16 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అయినా పోలీసుల కళ్లుగప్పి నిత్యం జూదం కొనసాగుతుండటంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. కొంతమంది పేకాట కోసం ఆస్తులు, బంగారం తాకట్టు పెడుతుండటంతో వారి బతుకులు తారుమారు అవుతున్నాయి.

ఇళ్లు, మామిడితోటలే అడ్డాలు..

చాలా మంది పేకాటరాయుళ్లు ఇళ్లు, మామిడి తోటలు, ఫామ్‌హౌస్‌లు, అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సీసీ కెమెరాలు, రోడ్ల వెంట ఇన్‌ఫార్మర్లను పెట్టుకొని, జూదం ఆడుతున్నారు. నెలకు సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల మేర సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో రెండంతస్తుల భవనాలను అద్దెకు తీసుకొని, కింది అంతస్తులో కుటుంబాలను అద్దెకు ఉంచుతూ రెండో అంతస్తులో జూదం నిర్వహిస్తున్నారు.

ఇతర జిల్లాల నుంచి వస్తున్న జూదరులు

జగిత్యాల జిల్లాలోని పేకాట స్థావరాలకు ఇతర జిల్లాల నుంచి కూడా జూదరులు పెద్ద ఎత్తున వస్తున్నారు. పోలీసులు కఠినచర్యలు తీసుకుంటున్నా వారు వెనుకడుగు వేయడం లేదు. పేకాడుతున్న సమయంలో పోలీసులు దాడులు చేస్తే చాలామంది జూదరులు వారి కళ్లుగప్పి, పారిపోతున్నారు.

అడ్డుకట్ట పడేదెలా?

జిల్లా వ్యాప్తంగా పేకాటను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఆగడం లేదు. జూదం ఆడేవారికి కోర్టులో కఠిన శిక్షలు లేకపోవడంతో చాలా మంది పట్టుబడినా తమ ప్రవర్తన మార్చుకోవడం లేదు. బయటకు వచ్చి, మళ్లీ పేకాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తెస్తే తప్ప జూదానికి అడ్డుకట్ట పడేలా లేదు.

పేకాటపై ప్రత్యేక నిఘా



జగిత్యాల జిల్లాలో పేకాటను అరికట్టేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. చాలా మందిపై కేసులు నమోదు చేస్తూ అరెస్టు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కఠినచర్యలు తీసుకుంటున్నాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

క్రమశిక్షణ.. జీవితానికి పునాది


ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న సెక్టోరియల్ అధికారి రాజేశం, హెచ్‌ఎం రత్నాకర్‌రావు

మల్యాల(చొప్పదండి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లోని క్రమశిక్షణ జీవితానికి పునాది వేస్తుందని, కష్టసుఖాలను సమంగా స్వీకరించేతత్వం అలవడుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి రాజేశం అన్నారు. నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయుల బోధనలో పిల్లల భవితకు బాటలు పడతాయని పేర్కొన్నారు. మల్యాల మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వారి సమక్షంలో పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంతో విద్యార్థుల చేతిరాత, చదువుపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. సమావేశంలో టీచర్లు పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్'కు దరఖాస్తు చేసుకోండి

- అపరాధ రుసుము రూ.100తో నేటివరకు గడువు
- కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామప్రసాద్


రామప్రసాద్, ప్రిన్సిపాల్


కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

కోరుట్లటౌన్: పాలిటెక్నిక్ విద్యతో మంచి భవిష్యత్ ఉంటుందని కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామప్రసాద్ తెలిపారు. పాలిటెక్నిక్‌లో ఏ బ్రాంచిలో ప్రవేశం తీసుకున్నా ఉన్నత చదువుకు ప్రణాళిక వేసుకోవచ్చన్నారు. మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బాలురకు కళాశాలలోనే, బాలికలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రభుత్వ హాస్టల్ వసతి ఉందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలకు హాస్టల్ నుంచి రావడానికి ఆర్టీసీ ఉచిత బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. మౌలిక రంగాల అభివృద్ధిలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి కోర్ బ్రాంచి విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పరిశ్రమలు స్థాపించి, స్టార్టప్‌లు నెలకొల్పి, ఉన్నతంగా ఎదగవచ్చని తెలిపారు. పాలిటెక్నిక్ రెండో సంవత్సరం పూర్తయ్యాక ఈసెట్ ద్వారా నేరుగా ఇంజినీరింగ్ రెండో సంత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. పదోతరగతి పరీక్షలు రాసిన ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 ఆఖరు తేదీ కాగా రూ.100 అపరాధ రుసుముతో 25 వరకు చేసుకోవచ్చని సూచించారు.

సహకార సంఘాలు బలోపేతం కావాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి(కోరుట్ల): సహకార సంఘాలు మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లి, సత్తెక్కపల్లి, బండలింగాపూర్ గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయా సంఘాలు రైతులకు ఎన్నో విధాలుగా సేవలందిస్తున్నాయని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ తీగల లింగారెడ్డి, సర్పంచ్‌లు తిరుపతిరెడ్డి, అంజయ్య, లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

- అడిషనల్ డీఆర్డీవో శివాజీ
- పెగడపల్లి మండలంలో రూ.3.97 లక్షల రికవరీకి ఆదేశాలు


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

పెగడపల్లి(ధర్మపురి): ఉపాధిహామీ పథకం నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్డీవో బాలే శివాజీ హెచ్చరించారు. పెగడపల్లి మండలంలో జనవరి 2020 నుంచి మార్చి 2023 వరకు రూ.17 కోట్ల విలువైన 588 పనులకు సంబంధించి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ 13వ విడత ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 39 నెలల్లో 585 పనులు చేపట్టినట్లు తెలిపారు. వీటిలో రూ.3.97 లక్షలు లక్షల దుర్వినియోగం జరిగినట్లు తనిఖీల్లో తేలిందన్నారు. ఇందులో గ్రామ పచాయతీల నుంచి రూ.2.35 లక్షలు, నందగిరి, సుద్దపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.13,196, ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.25,742, కంప్యూటర్ ఆపరేటర్ నుంచి రూ.6 వేలు, ఈసీ నుంచి రూ.4,800, ఏపీవో నుంచి రూ.5 వేలు, మేట్ల నుంచి రూ.6,652, లబ్ధిదారుల నుంచి రూ.22,972 రికవరీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనులు కల్పించాలి..

ఉపాధిహామీ జాబుకార్డు ఉన్నవారికి నిర్దేశిత పనులు కల్పించాలని అడిషనల్ డీఆర్డీవో అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపడుతున్న పనులను ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. లోటుపాట్లు ఉంటే సలహాలు, సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శోభ, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, విజిలెన్స్ అధికారి చిన్నయ్య, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజేంద్రప్రసాద్, ఎంపీడీవోలు పుల్లయ్య, వెంకటేశం, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఎస్‌ఆర్పీ రాఘవులు, ఏపీవో వేణు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీఏలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో ముక్కలైంది

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన స్థాయి తగ్గించుకొని మాట్లాడొద్దు
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: కాంగ్రెస్ ఎప్పుడో ముక్కలైందని, ఆ పార్టీని చీల్చే అవసరం బీఆర్‌ఎస్‌కు లేదని, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన స్థాయిని తగ్గించుకొని మాట్లాడొద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉందని, ప్రతిపక్షాలు ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేసుకొని అనవసర విమర్శలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర నిర్మల్ నుంచి మంచిర్యాలకు వచ్చేసరికి నిర్మల్ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరడంతోనే కాంగ్రెస్ పరిస్థితి ఏమిటో తెలిపోయిందన్నారు. సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ కవితపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని అనడం సమంజసం కాదని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని, మంత్రులను టార్గెట్ చేస్తూ వేధింపులకు గురిచేస్తోందని మండిపడ్డారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు నారాయణరెడ్డి, రాంకుమార్, రమణ, మహిపాల్‌రెడ్డి, రామారావు, నాయకులు పాల్గొన్నారు.

మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా అమిత్ షా ప్రసంగం

- పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రసంగం ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జగిత్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమిత్ షా ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బలహీనవర్గాల రిజర్వేషన్లు 40 శాతానికి పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. వారికి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్లు మించవద్దనే నిబంధన తొలగించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, దానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు పలుకుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, నాయకులు ముజాహిదిన్, నందయ్య, దుర్గయ్య, చాంద్‌పాషా, జున్ను రాజేందర్, నేహాల్, రాధాకిషన్‌రావు, మహిపాల్, రాజేశ్, స్వామిరెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 వేల పరిహారమివ్వాలి

- ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ


తక్కళ్లపెల్లిలో మాట్లాడుతున్న ఉమ

కథలాపూర్(వేములవాడ): అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారమివ్వాలని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కథలాపూర్ మండలంలోని దూలూర్, తక్కళ్లపెల్లి, బొమ్మెన గ్రామాల్లో వర్షానికి నేలవాలిన వరి, నువ్వు పంటలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమలు చేస్తే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వచ్చేదన్నారు. బీజేపీ నాయకులు శ్రీరాముల ప్రకాశ్, నరెడ్ల రవీందర్‌రెడ్డి, మేడిపెల్లి గంగాధర్, అల్లూరి బాపురెడ్డి, మొలిగె శ్రీనివాస్, ప్రకాశ్, రాజు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కుట్టు మిషన్లు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని తీన్‌ఖని చౌరస్తా వద్దనున్న ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్‌లో ఈ నెల 11న రాత్రి కుట్టు మిషన్లు, ఆటవస్తువులు చోరీ చేసిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మంచినీళ్ల బావి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఆ సమయంలో తీన్‌ఖని చౌరస్తాకు చెందిన సాయికుమార్, వైభవ్‌లు కుట్టు మెషీన్లను విక్రయించేందుకు తీసుకెళ్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. 7 కుట్టు మిషన్లు, ఆటవస్తువులు స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ముగ్గురు మైనర్లు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

దివ్యాంగురాలిపై దాడి చేసినవారిని శిక్షించాలి


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల క్రైం: మల్లాపూర్ మండలంలోని వాల్గొండకు చెందిన దివ్యాంగ యువతిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దివ్యాంగ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. దివ్యాంగురాలికి న్యాయం జరిగేవరకు ఉద్యమిస్తామన్నారు. చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లంకదాసరి శ్రీనివాస్, గౌరిశెట్టి చంద్రశేఖర్, తోట సంజీవ్, ఓంప్రకాశ్, నర్సయ్య, శ్రీనివాస్‌రావు, దేవరాజు, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

వైన్స్‌లో చోరీకి విఫలయత్నం

కొడిమ్యాల(చొప్పదండి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శ్రీ మణికంఠ వైన్స్‌లో చోరీకి విఫలయత్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. దుండగుడు ఆదివారం రాత్రి వైన్స్ పర్మిట్ రూం తలుపులు పగులగొట్టి, సామగ్రి తీసుకున్నాడు. వైన్స్ వెనుకవైపు ఉన్న షట్టర్‌ను గడ్డ పారతో పైకి ఎత్తి, లోపలికి దూరేందుకు ప్రయత్నించాడు. అయితే షట్టర్ వెనుక మరో గోడ అడ్డుగా ఉండటంతో లోపలికి వెళ్లలేకపోయాడు. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయింది. ఈ ఘటనపై వైన్స్ యజమానులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సొంత షెడ్లలో వ్యాపారానికి అనుమతివ్వండి


వినతిపత్రం ఇస్తున్న మామిడి వ్యాపారులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామ శివారు మామిడి మార్కెట్‌లో వ్యాపారం చేసుకునేందుకు వ్యాపారులు అగ్రిమెంట్ చేసుకున్నారు. నాలుగేళ్లుగా విక్రయాలు సాగిస్తున్నాయి. కానీ ఈ ఏడాది ఆలస్యం జరిగినందున తమకు సొంత షెడ్లలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

మర్చిపోయిన ఆభరణాలు అప్పగింత


ఆభరణాలున్న బ్యాగు అప్పగిస్తున్న శ్రీనివాస్

బుగ్గారం(ధర్మపురి): భోజనం చేసేందుకు రెస్టారెంట్‌కు వచ్చినవారు తిరిగి వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలున్న బ్యాగును అక్కడే మర్చిపోయారు.. మరుసటిరోజు సదరు రెస్టారెంట్ యజమాని దాన్ని బాధితులకు అప్పగించిన ఘటన సోమవారం ధర్మపురి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మంచిర్యాల పట్టణానికి చెందిన దంపతులు ఆదివారం రాత్రి ధర్మపురిలోని ఎస్‌ఎన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో భోజనం చేశారు. తిరిగి వెళ్తూ తమ వెంట తెచ్చిన బంగారు నగల బ్యాగును అక్కడే మర్చిపోయారు. కాసేపటికి రెస్టారెంట్ సిబ్బంది ఆ బ్యాగును గుర్తించి, తమ యజమాని మురికి శ్రీనివాస్‌కు అందించారు. కానీ అందులో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆయన అలాగే భద్రపరిచారు. మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలనుకున్నారు. ఈ క్రమంలో బాధితులు ఉదయం తమ బ్యాగు పోయినట్లు గుర్తించారు. హుటాహుటిన రెస్టారెంట్‌కు వచ్చారు. జరిగిన విషయాన్ని యజమానికి చెప్పారు. పూర్తి వివరాలు తెలుసుకున్న ఆయన ఆభరణాల బ్యాగును వారికి అప్పగించారు.

'మా భూమిని మాకు పట్టా చేయాలి'


నిరసన తెలుపుతున్న బాధితులు

మల్లాపూర్(కోరుట్ల): మా భూమిని మాకు పట్టా చేయాలంటూ ఓ కుటుంబం నిరసన తెలిపిన సంఘటన మల్లాపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వారి వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన పల్లి రాజంకు 108/1, 108/2 సర్వే నెంబర్లలో 2.12 గుంటల భూమి ఉంది. దాన్ని మేడిపల్లి రాజారెడ్డి, పిప్పెర మహేందర్‌లు అక్రమంగా పట్టా చేయించుకున్నారు. ఎనిమిదేళ్లుగా తమ భూమిని తమకు పట్టా చేయండి అంటూ వారిని వేడుకుంటున్నారు. కానీ పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితులు రాజారెడ్డి ఇంటి ఎదుట బైఠాయించారు. సంబంధిత అధికారులు స్పందించి, భూమిని తమ పేరిట పట్టా చేయించి, ఇవ్వాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్‌ను వివరణ కోరగా బాధితులు భూ సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- గ్రామ పంచాయతీల బిల్లులు రాక సర్పంచ్‌ల ఆవేదన
- ప్రతి గ్రామ పంచాయతీకి రూ.5 లక్షల నుంచి 15 లక్షలు పెండింగ్
- పదవీ కాలం ముగిసే కొద్దీ నెలకొన్న టెన్షన్


సారంగాపూర్‌లోని రైతువేదిక

సారంగాపూర్: సర్పంయుల పదవి కాలం మరో ఎనిమిది నెలల్లో ముగియనుండటంతో తమకు రావాల్సిన బిల్లులు గురించి ఆందోళన చెందుతున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన పనులను పూర్తిచేసి రెండేళ్లైనా పూర్తిస్థాయి బిల్లులు రాకపోవడంతో సర్పంచులు బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు ప్రతి గ్రామ పంచాయతీకి వివిధ పనుల కింద పూర్తిచేసిన పనులకు రూ. 5 లక్షల నుండి రూ.15 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది.

అభివృద్ధి పనులు ఇలా..

గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు, నిత్యం చేపట్టే పనులకు ఎప్పటికప్పుడు బిల్లులను చెల్లించాలి.

- పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైకుంఠధామాలు, కంపోస్ట్ షెడ్లు, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, ట్రాక్టర్‌ల నిర్వహణ పనులు, హరితహారం కింద మొక్కలు నాటడం, వంటి పనులు...
- క్లస్టర్ వారీగా ప్రతి 8 గ్రామాలకు కలిపి రూ. 22 లక్షలతో రైతు వేదికల నిర్మాణం, మురుగు కాల్వలు, కాలనీల్లో సీసీరోడ్లు నిర్మాణ పనులు..
- మన ఊరు –మన బడి కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు..

సెప్టెంబర్ వరకు జమయిన నిధులు..

పల్లెప్రగతి పనులకు 2022 సెప్టెంబర్ వరకు ప్రతినెలా గ్రామ పంచాయతీల్లో నిధులు జమయ్యాయి. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా ఒక్కరికి (తలసరి) సుమారుగా రూ. 128 నుంచి రూ. 130 వరకు వస్తుంది. సెప్టెంబర్ తర్వాత నిధుల్లో కోత విధించింది. దీనితో గ్రామ పంచాయతీల్లో డబ్బులు నిలువ ఉన్నా, వాటిపై ప్రభుత్వం ఫ్రీజ్ చేయడంతో బిల్లులు నిలిచిపోయాయి.+దీనితో పాటు ముఖ్యంగా పారిశుధ్యం నిర్వాహణ, గ్రామపంచాయతీల్లో పనులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది వేతనాలకు కూడ డ్రా చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధిహామీ మెటీరియల్ చెల్లింపులు కేంద్రం నుంచి నేరుగానా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమకావాల్సి ఉంది. ఉపాధిహామీ నిధుల కింద చేపట్టిన సీసీ రోడ్లు, మురికి కాల్వలు, తదితర బిల్లులు దాదాపు 6 నెలల నుంచి సక్రమంగా జమకావడం లేదు

మరో ఎనిమిది నెలల్లో పదవి కాలం

సర్పంచ్‌లు ఫిబ్రవరి 2019లో బాధ్యతలు స్వీకరించారు. వచ్చే సంవత్సరం జనవరి 2024 పదవి కాలం ముగియనుంది. మళ్లీ ఎన్నికల్లో ఓటమి చెందితే వచ్చే కొత్త సర్పంచ్ బిల్లులు ఇచ్చేందుకు ఎన్ని కొర్రీలు పెడతారోనని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు..

తప్పని షోకాజు నోటీసులు...

గ్రామపంచాయతీలు నెలానెలా అత్యవసర చెల్లింపులు చేయాల్సిన పద్దులు కొన్ని ఉన్నాయి. తప్పనిసరి అందులో ప్రతి నెలా కరెంటు బిల్లులు, సిబ్బంది వేతనాలు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంది. గ్రామ పంచాయతీకి ఏ నిధులు ముందుగా జమైనా వెంటనే చెల్లించాలి, లేకపోతే గ్రామ కార్యదర్శికి , ఎంపీవో, ఎంపీడీవోకు షోకాజు నోటీసులు, మెమోలు జారీ చేస్తున్నారు.

రూ. 16 లక్షలు రావాలి



పెంబట్ల గ్రామపంచాయతీకి సీసీరోడ్లు, గ్రామపంచాయతీల నిర్వహణ వంటివి రూ.6 లక్షలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. మన ఊరు మన బడికింద పాఠశాలల అభివృద్ధి పనులు, ఈజీఎస్ కింద రూ. 10 లక్షలు రావాలి.

– బొడ్డుపల్లి రాజన్న, సర్పంచ్, పెంబట్ల

ఆరు నెలలు దాటింది



బతుకమ్మ పండగకు ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు, డిజే సౌండ్ సిస్టం, పూల అలకారం, బతుకమ్మలు నిమజ్జనం చేసే చోట ఏర్పాట్ల కింద రూ. 35 వేలు బిల్లు పెట్టి ఆరునెలలు అవుతుంది. రెండేళ్లకింద చేసిన రైతువేదిక బిల్లు, రోడ్లు, ఇతర బిల్లులు రూ. 10 లక్షలు రావాలి..

ఆకుల జమున, సర్పంచ్, కోనాపూర్

కార్యాచరణ రూపొందిస్తాం



పార్టీలకు అతీతంగా సర్పంచులంతా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు సమస్య విన్నవించుకుంటాం. ఇప్పటికే పలువురు సర్పంచులు రాజీనామాకు వెళ్తాం అన్నారు. ఎమ్మెల్యే ద్వారా మంత్రులను కలిసి సమస్యను పరిష్కరించుకుంటాం.

– గుర్రాల రాజేందర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సారంగాపూర్

అధైర్య పడొద్దు..పింఛన్ అందిస్తాం

- వృద్ధురాలికి ఎమ్మెల్యే రవిశంకర్ హామీ


వృద్ధురాలితో ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: మండలంలోని పూడూరు గ్రామానికి చెందిన పెద్ది నర్సవ్వ అనే వృద్ధురాలి భర్త మల్లయ్య గత నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు రాలేదు. సోమవారం గ్రామంలో అనుమాండ్ల రాఘవరెడ్డి స్మారక వైద్య శిబిరం ప్రారంభించేందుకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వచ్చారు. దీంతో తనకు పింఛన్ కోసం రావడం లేదని ఎమ్మెల్యేకు వివరించడంతో స్పందించిన ఎమ్మెల్యే అవ్వా నీకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. కలెక్టర్‌తో మాట్లాడి పింఛన్ మంజూరు చేయాలని తెలుపగా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వచ్చే నెల నుంచి పింఛన్ మంజూరు అయ్యేందుకు అప్రూవల్ వచ్చేలా చేసిన ఎమ్మెల్యేకు నర్సవ్వ కృతజ్ఞతలు తెలిపారు.



రథోత్సవం

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస గ్రా మశివారులోని శ్రీ పొలస్తేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీ ఉమా సహిత పొలస్తేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు


దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగిత్యాల రూరల్: భగవాన్ సత్యసాయిబాబా ఆరాధనా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో హాజీపురా ఉన్నత పాఠశాలలో వైద్యులు జిడ్డె కేశవ్, జిడ్డె జ్యోతి ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లతీఫ్, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ప్రాంతీయ ఇన్‌చార్జి పూటూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

శివపురాణం యజ్ఞం


ప్రసంగిస్తున్న వేద పండితులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని శుభమస్తు గార్డెన్స్‌లో ప్రముఖ వేద పండితులు వేణుగోపాలచార్య కౌశిక, తిగుళ్ల విష్ణుశర్మ ఆధ్వర్యంలో శివపురాణం ప్రవచనం మహాయజ్ఞం ప్రారంభమైంది. ఈనెల 24నుంచి 30 వరకు రెండుపూటలు శివపురాణం జరుగుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

షర్మిల అడ్డుకోవడం అప్రజాస్వామికం

గొల్లపల్లి: లోటస్ పాండ్ నుంచి బయటకు వస్తున్న క్రమంలో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకుని అరెస్టుకు పాల్పడటం అప్రజాస్వామికమని వైఎస్సార్ టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ అన్నారు. గొల్లపల్లిలో మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

రాయికల్: రాయికల్ మండలం వీరాపూర్‌లోని ఖబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సోమవారం కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

వినతిపత్రం అందజేత

సారంగాపూర్: ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ఉద్యోగాలను ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరుతూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

అంబలి పంపిణీ

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి పుణ్యక్షేత్రానికి విచ్చేసే భక్తుల సౌకర్యం కోసం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి మద్ది కిషన్ ఉచితంగా అంబలి పంపిణీని ప్రారంభించారు. వేసవి దృష్ట్యా కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నియామకం

మెట్‌పల్లి: మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన అంబటి హన్మాండ్లును కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని సోమవారం జిల్లా అధ్యక్షులు వాకిట సత్యంరెడ్డి ఆయనకు అందజేశారు. రైతు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

బాధితరైతులను ఆదుకుంటాం

కథలాపూర్: వర్షాలతో పంటలు నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, జెడ్పీటీసీ నాగం భూమయ్య పేర్కొన్నారు. సిరికొండ, దూలూర్ గ్రామాల్లో పంటలను పరిశీలించారు.

భూమిపూజ.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ఆరో వార్డులో, ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలు ఎంపీ బండి సంజయ్ మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు.

ప్లీనరిని జయప్రదం చేయాలి

జగిత్యాల : నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు పార్టీలోని అన్ని విభాగాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులకు పద్మనాయక కల్యాణ మండపంలో మంగళవారం ప్లీనరీని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యకర్త, ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

జగిత్యాల : అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ రాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ వారోత్సవాలు నిర్వహించారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవ కార్యక్రమాన్ని ధర్మపురి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ప్రీస్కూల్ కార్యక్రమాలను పిల్లలతో చేసి చూపించారు.

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్, యూసుఫ్‌నగర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ డే వేడుకలను నిర్వహించారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు

రాయికల్: ఎవరైనా గంజాయి సాగుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు యువత మేలుకో... గంజాయి మానుకో అనే నినాదంతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో అవగాహన కల్పించారు.

సారంగాపూర్: మండల కేంద్రంలో సామాజిక, భద్రతపరమైన అంశాలపై పోలీస్ కళాబృందాలు అవగాహన కల్పించారు. ఎస్సై మనోహర్‌రావు గంజాయి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కోరుట్ల : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో యువతా మేలుకో..గంజాయి మానుకో ప్రచార ఆటోను పోలీసులు ప్రారంభించారు. యువత చెడు వైపు వెళ్లొద్దంటూ అవగాహన కల్పిస్తున్నారు.



ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

రాయికల్ : పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలె జయశ్రీ శేఖర్, డైరెక్టర్ నిఖిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల హంగామా



విద్యార్థుల నృత్యాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస ఎక్స్‌లెన్స్ ఐఐటీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మానస స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్చరల్ డిలైట్ 2కే23 పేరిట అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత్‌రావు పాల్గొన్నారు.

బదిలీలు సహజం

ఇబ్రహీంపట్నం : ఉద్యోగంలో బదిలీలు సహజమని తహసీల్దార్ మహేశ్వర్ అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సంసొద్దీన్ జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్తుండగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అనురాధ, ఆర్‌ఐలు రమేశ్, గంగాధర్, వీఆర్‌ఏలు సతీశ్, కైలాష్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు పరిహారం చెల్లించాలి


తహసీల్దార్‌కు విన్నవిస్తున్న మామిడి రైతులు

ఇబ్రహీంపట్నం : ఈదురుగాలులు, అకాలవర్షాలతో నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరానికి రూ.10వేల పరిహారం చెల్లించాలని మండలకేంద్రంలోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మామిడి రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు. ప్రజావాణికి కేవలం నలుగురు అధికారులు ఏవో దీపిక, ఏపీఎం శంకర్, ఏపీఎంవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రతిభ హాజరయ్యారు. కార్యక్రమంలో చిన్న సాయన్న, భూమేశ్, బావులు, వెంకట్, పిట్టల భూమేశ్, పిట్టల వంశీకృష్ణ, గడ్డం మహేశ్, నేమూరి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రాయికల్ : పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న కొడిమ్యాల రిషిత తండ్రి ఇటీవల మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో 2022–23 పదో తరగతి పూర్వ విద్యార్థులు రిషితను ఇంటర్ చదివే వరకు పూర్తిస్థాయి బాధ్యత తీసుకుంటామని ప్రకటించారు. తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్ కల్లెడ సునీత, కరస్పాండెంట్ గంగాధర్, పూర్వ విద్యార్థులు మచ్చ రాజ్‌కుమార్, రాజశేఖర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



రాయికల్ : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించిన పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ తిరుపతిరావు, ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు, డ్యాన్స్ మాస్టర్ బాలు పాల్గొన్నారు.

పిడుపాటుతో పాడి గేదెలు మృతి


మృతిచెందిన గేదెలను చూపుతున్న రైతు

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన బొడపట్ల చారి అనే రైతు పాడి గేదెలను ఆరుబయట కట్టేసి ఉంచగా పిడుగు పాటుతో మృతి చెందాయి. దీంతో రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెగడపల్లి: హైదరాబాద్‌లో డా.బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ అంబేడ్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు. మండలంలోని అయితిపల్లిలో విగ్రహా ఏర్పాటును హర్షిస్తూ సీఎం కేసీఆర్, సంక్షేమశాఖ మంత్రి ఈశ్వర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మట్లాడుతూ నూతనంగా నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ నామకరణం చేయడం సంతోషకరమన్నారు. మండల అధికార ప్రతినిధి జేరిపోతుల శ్రీనివాస్, నాయకులు బాబు, రాజనర్సయ్య, చందు, మల్లేశం, పూర్ణచందర్, బీఆర్‌ఎస్ నాయకులు సంజీవరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ. రెండు లక్షల విరాళం


విరాళం అందిస్తున్న అజయ్ కుటుంబ సభ్యులు

బుగ్గారం(ధర్మపురి): పట్టణంలోని ప్రముఖ ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీఅక్కపెల్లి రాజేరాజేశ్వరస్వామి ఆలయానికి ఓ భక్తుడు రూ.2 లక్షలను విరాళంగా అందించారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ ఇటీవల దుబాయ్ లాటరీలో రూ.33 కోట్లు గెలుచుకున్న విధితమే. ఇప్పటికే పలు విరాళాలు అందించిన అజయ్ తాజాగా అక్కపెల్లి ఆలయంలో పలు అభివృద్ధి పనుల కోసం రెండు లక్షల రూపాయలను అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ చెన్నోజి ప్రసాద్, సభ్యులు కాశెట్టి విజయ్‌కుమార్, నూనె సంతోష్, సంగి తిరుపతి, గడ్డం రమణారెడ్డి, అర్చకులు ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీకి తరలిరావాలి

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్

మల్లాపూర్ : బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మెట్‌పల్లిలో నిర్వహిస్తున్న ప్లీనరీ సమావేశానికి పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి మండల, గ్రామ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం : మెట్‌పల్లిలో మంగళవారం నిర్వహించే వీఆర్‌ఎస్ గార్డెన్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నేమూరి సత్యనారాయణ కోరారు. సోమవారం మండలకేంద్రంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను సమావేశానికి తరలించాలని కార్యకర్తలకు సూచించారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, సర్పంచ్ నేమూరి లత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు బద్దం గోపి, బాస శ్రావణ్, వైస్ చైర్మన్ జిల్లాల పవన్, ఎంపీటీసీ తిమ్మణి రాములు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రెబ్బటి రాజేందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయికల్: కంటి వెలుగును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. మండలంలోని ఆల్యానాయక్ తండాలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచితంగా కంటి పరీక్షలతో పాటు అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపరు. కార్యక్రమంలో సర్పంచ్ నందునాయక్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం : గ్రామస్తులు కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి ప్రారంభించారు. వైద్యాధికారి శ్రీజ, ఎంపీడీవో ప్రభు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు

రాయికల్/కోరుట్ల రూరల్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/పెగడపల్లి:/కొడిమ్యాల/సారంగాపూర్/ ఆరుగాల శ్రమించి పండించిన పంటను రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు పొందాలని సూచించారు.